# శ్రీ బ్రహ్మ వైవర్త మహా పురాణము

(వచనం)



వేదవ్యాసకృతము

పురాణభారతి
ప్రచురణలు - 12

# శ్రీ బ్రహ్మవైవర్త మహాపురాణం

(వచనం)

## వేదవ్యాస మహర్షికృతం

(బ్రహ్మ, ప్రకృతి, గణేశ, శ్రీకృష్ణజన్మ (పూర్వార్ధ, ఉత్తరార్ధ) ఖండములు)

అనుసరణ
**ఆవంచ సత్యనారాయణ**

ప్రేరణ
**ఇమ్మడిశెట్టి అక్కేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్ట్**
డోర్ నెం. 11-16-32 ఎ, సింగరాజువారి వీధి,కొత్తపేట,
విజయవాడ - 520001. ఫోన్ : 2565038.

# శ్రీ బ్రహ్మవైవర్త మహాపురాణం

© Immadisetty Akkeswara Rao Charitable Trust.

అనుసరణ :
**A. SATYANARAYANA** M.A., B.Sc., B.Ed., B.O.L.
Retd. Principal, A.P. Residential Schools,
Srisailam Project, & Gorantla, Kurnol Dist.
Addateegala & Bhupathi palem, East Godavari Dist.

ప్రథమ ముద్రణ : 2011

**వెల రు. 500/–**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్**

**సాయి వెంకటేశ్వర బుక్ డిపో**
**26-27-77, బాటా షోరూమ్ ఎదురు,**
**గాంధీనగర్, విజయవాడ-520309**
**విజయవాడ-520 001.**
ఫోన్ : **(0866) 2570192, 2570309**

* * * * *

**శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో**
ప్లాట్ నెం. 3, 103, 2-4-1085,
సాయిలక్ష్మీ నికేతన్, రామకృష్ణా హాస్టల్ ఎదురు
వీధి, కాచిగూడ కుమార్ థియేటర్ దగ్గర,
నింబోలి అడ్డ, **హైదరాబాద్ - 500 027.**
ఫోన్ : **(040) 65528228, 24653879,**
(Fax) **24745257,** Cell : **9346771314**

**Publishers :** Sri Venkateswara Book Depot, Vijayawada

We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.



Lion. ఇమ్మడిశెట్టి రామకుమార్ PMJF

# వినతి

భారతీయ ధార్మిక విషయాలన్నీ వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మొదలైన వానిలో సంపూర్ణంగా ప్రతిఫలిస్తున్నాయి. భారతీయ ధర్మమే మానవ ధర్మము లేక సనాతన ధర్మము అని పిలువబడుతున్నది. ఈ ధర్మము వైదిక జీవన విధానం మీద ఆధారపడి ఉన్నది. కానీ ఈ సనాతన ధర్మాన్ని ఈనాడు మనం హిందూ ధర్మం అంటున్నాం. ఇతర దేశీయులు కొందరు 'స' బదులు 'హ' ఉచ్చరిస్తారు కాబట్టి సింధూప్రాంతంలో తొలుత ఉన్న ఆర్యులు అవలంబించిన వైదిక జీవన విధానం 'సింధూ' ధర్మం బదులు 'హిందూ' ధర్మం అయింది. దానిని ఆదరించే వారు, ఆచరించేవారు హిందువులు అయినారు. ఇతర ధర్మాల వారికి వారివారివి మతాలు. 'మతము' అంటే ఒక పాక్షిక వాదము అని మాత్రమే అర్థం. వారికి వారిది మతమే కావచ్చు. ఎందుకంటే వారి మతాలు ఒక నిశ్చితమైన నమ్మకంమీద ఆధారపడి ఏర్పడిన సంస్థాగత విధానాలు. కానీ హిందువులు అవలంబించేది అలాంటి మతం కాదు. ఇది కరుడుగట్టిన కొన్ని నిశ్చితమై నమ్మకాల ఆధారంగా ఏర్పడినది కాదు. ఇది ధర్మం - అంటే ఆచరించ వలసిన లేక జీవన విధానం. అలాగే ఇది ఒక గ్రంథం ఆధారంగానో లేక ఒక మనుష్యుడు ప్రబోధించిన బోధనలమీదనో ఆధారపడినది కాదు. ఇది శాశ్వత విలువల ప్రాతిపదికన ఏర్పడిన ఆధ్యాత్మిక, అపౌరుషేయ (మనిషి అయినవాడు ఎవనిచేత కాదు) జ్ఞానంవల్ల ఏర్పడిన అవిచ్ఛిన్న పరంపరచేత ఏర్పడిన వ్యవస్థ. ఈ రకమైన ఆలోచనా విధానం ఎప్పుడూ క్రొత్త ఆవిష్కారాలను సహజంగానే స్వీకరించి వ్యష్టిగతమైన మనస్సును సమష్టి వైపుగా ప్రయాణించేటట్లు చేస్తుంది. తనకు నచ్చిన దారిని అనుసరించే వెసులుబాటును కల్పిస్తుంది. అదే హిందూ ధర్మపు ప్రత్యేకత.

శబ్దము లేక 'శ్రుతి' లేక అనుశ్రుత పూర్వకంగా వచ్చే శాస్త్రం లేక సంస్కృతియొక్క ప్రభావ జన్యమైన వాక్కు కాలాన్ని బట్టి పూర్తిగా మారదు. ఈ శబ్దమే పురాణం. పురాణం అంటే ప్రాచీనమైనది అని అర్థం. ప్రజాపతి బ్రహ్మకువేదం కంటే ముందే స్మరణకు వచ్చిన

శబ్దములే అనాదిగా వచ్చిన అపౌరుషేయ పురాణాలు. దీనినే వ్యాసుడు 18 భాగాలుగా విభజన చేసి వానికి పౌరుషేయ రూపాన్ని ఇచ్చాడు. భారతీయ జీవన విధానము, భక్తి మార్గం లేక కర్మ యోగం మొదలైనవాని చక్కని సమన్వయం ఈ అష్టాదశ పురాణాలలోనే లభిస్తుంది.

ఇలాంటి అనేక విషయాలచేత పరిపుష్టమైన పురాణాలలో ఏమి ఉన్నదో తెలుసు కొనడం విద్యావంతులైనవారి అందరి కర్తవ్యం. అందుకే మేము అష్టాదశ పురాణాలను తేట తెలుగు వచనంలో అందరికి అందుబాటులోకి తీసుకొని రావాలని భావించాం. వీలైనంత వరకు క్లుప్తీకరణ లేకుండా మొత్తం పురాణాన్ని తెలుగు వచనంలో ఇవ్వాలని మా భావన. ఇప్పటికే శ్రీ కూర్మ, శ్రీ వామన, శ్రీ మత్స్య, శ్రీ బ్రహ్మ, శ్రీ అగ్ని, శ్రీ మార్కండేయ, శ్రీ వాయు, శ్రీ విష్ణు, శ్రీ నారద , శ్రీ బ్రహ్మాండ, శ్రీ స్కంధ మహాపురాణము ఈ క్రమంలో వెలువడ్డాయి. ఇది పన్నెండవ పురాణమైన శ్రీ బ్రహ్మవైవర్త మహాపురాణం. తెలుగువారు ఈ పురాణాలను ఆదరించి, అష్టాదశ పురాణాలను అందరికి అందుబాటులోకి తెచ్చే అవకాశం కలిగించ వలసిందిగా ప్రార్థిస్తున్నాను.

కీర్తిశేషులైన మా అన్నగారు శ్రీ ఇమ్మడిశెట్టి అక్కేశ్వరరావుగారి పేరు మీదగల ధర్మ సంస్థ అక్కేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఈ పురాణాలను వెలువరించడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ పురాణాలను ప్రచురించడం ద్వారా వారి ఆత్మకు సద్గతులను కల్పించాలని ఆ పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను.

తెలుగువారి ప్రతి ఇంటిని ఈ పురాణాలు అలంకరించాలని మా ఆకాంక్ష. అది నెరవేర గలదని భావిస్తూ .....

ఇట్లు

I. Rama Kumar

(ఇమ్మడిశెట్టి రామకుమార్)

మేనేజింగ్ ట్రస్టీ

**ఇమ్మడిశెట్టి అక్కేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్ట్**

విజయవాడ

విజయవాడ - 1

తేదీ. 04.04.2011.

## బ్రహ్మవైవర్త పురాణ ముద్రణ

బ్రహ్మవైవర్త పురాణం సంస్కృతంలో నలుగురిచేత ముద్రింపబడింది. అవి : పూనా ఆనందాశ్రమ ప్రతి, బొంబాయి శ్రీవేంకటేశ్వర పవర్ ప్రెస్ వారి ప్రతి, వంగదేశ గౌడీయం ముద్రణ ప్రతి. అలాగే అలహాబాద్ హిందీ సాహిత్య పరిషత్తు వారిచే హిందీలో ప్రతి శ్లోకానువాదంతో మూడు సంపుటాలుగా ప్రచురింపబడిన ప్రతి. ఇంకామరికొందరిచేత ప్రచురింపబడి ఉండవచ్చు. వివరాలెక్కువగా తెలియటంలేదు.

ప్రస్తుతం హైదరాబాద్ ఆర్షభారతీ ట్రస్టు వారి తరపున తెలుగులిపిలో ఈ మహాపురాణం మూలము తెలుగు అనువాదంతో ప్రచురింపబడింది. కాకతీయ సిమెంట్స్ లిమిటెడ్ అధినేత శ్రీ పి.వెంకటేశ్వర్లుగారు పురాణాలనన్నింటిని తెలుగు లిపిలో ప్రతిశ్లోక తెలుగు అనువాదంతో ప్రచురించాలనే మహాయజ్ఞంలో భాగంగా ఈ పురాణం 1999లో ముద్రణ భాగ్యంపొంది ప్రస్తుతం లభిస్తున్నది.

**ఈ పురాణ ప్రతి శ్లోక తెలుగు తాత్పర్యకర్తలు :**

**1వ సంపుటం, బ్రహ్మ, ప్రకృతి, గణేశఖండములు - శ్రీయన్.యల్.నరసింహాచార్యులుగారు**

**2వ సంపుటం - "శ్రీకృష్ణజన్మఖండం - పూర్వార్ధం - శ్రీ నల్లాన్‌చక్రవర్తుల వేదాంతాచార్యులవారు**

**3వ సంపుటం - శ్రీకృష్ణజన్మ ఖండం - ఉత్తరార్ధం - శ్రీ కిళాంచి నరసింహాచార్యులవారు.**

ఈ ముగ్గురు పండితులు ఈ మహత్కార్యాన్ని శ్రద్ధగా అత్యుత్తమంగా నిర్వహించారు.

ఈ పురాణ అనువాదం నుంచి మేము చాలా విషయాలను స్వీకరించాం. ఆ గ్రంథాన్ని ప్రకటించిన శ్రీవేంకటేశ్వర ఆర్షభారతి ట్రస్టు హైదరాబాద్ వారికి, అనువాద మహాయజ్ఞ నిర్వాహకులు శ్రీ నరసింహాచార్యులు, వేదాంతచార్యులు, కిడాంబి నరసింహాచార్యులవారికి అనేక కృతజ్ఞతా పూర్వక నమస్కార శతకములు అర్పిస్తున్నాము.

**తెలుగులో బ్రహ్మవైవర్త పురాణము :**

బ్రహ్మవైవర్త పురాణాన్ని దోమా వెంకటస్వామి గుప్తాగారు అనువదించినట్లు తెలుస్తున్నది. అయితే వివరములు తెలియరావటంలేదు. అది బ్రహ్మవైవర్తము లేక బ్రహ్మేశ్వర పురాణం అని కొందరు వ్రాశారు.

గోపీనాధం వెంకటకవి - కృష్ణజన్మ ఖండము - 8 ఆశ్వాసాలు - అష్టాదశ పురాణాంతర్గత బ్రహ్మ వైవర్త పురాణములలో గల కృష్ణ వృత్తాంత కథలు.

సర్వజ్ఞ కుమారయాచేంద్రుని ప్రేరణచే - రాఘవాంకితముగా

పోషకులు బ్రహ్మవైవర్త పురాణంలోని శ్రీకృష్ణ జన్మఖండమును రచించి రాఘవాంకితము చేయబడిందని తెలుస్తున్నది.

ఇది శ్రీకృష్ణుని పరబ్రహ్మ స్వరూపుడుగా సంభావితుడైన శ్రీకృష్ణుని మహిమలను గోపికా ప్రణయ లీలా విలాసములను అభివర్ణించే గ్రంథం. బ్రహ్మవైవర్త పురాణంలోని శ్రీకృష్ణజన్మఖండానికి ఔచితీ సుందరమైన ఆంధ్రీకరణము. ఇది తరువాత గోపీనాధం వెంకట కవి పూర్తి బ్రహ్మవైవర్త పురాణాన్ని పద్యకావ్యంగా ఆంధ్రీకరించినట్లు తెలుస్తున్నది.

ఈయన కృతులు బ్రహ్మానంద శతకము, భగవద్గీతా శాస్త్రము, శిశుపాలవధ, రాధికా పరిణయము, బ్రహ్మవైవర్త పురాణము, శ్రీమద్రామానుజ చరిత్రము, వచనము ఆదిత్యహృదయము, గోపీనాథ రామాయణములు – కవి 19వ శతాబ్దం ఉత్తరార్థంలో జీవించాడు. కృతి ప్రోత్సాహకుడు సర్వజ్ఞ కుమార యాచేంద్రుని కాలం 1832–1892. కవి కాలం కూడా దాదాపు అదే కావచ్చును.

ఈయన శ్రీకృష్ణజన్మఖండం (1889) రాధికా పరిణయం అనే పద్య కావ్యాలనేగాక బ్రహ్మవైవర్తపురాణాన్ని ఆంధ్రీకరించారు. అది పద్యకావ్యం ముద్రణ వివరాలు తెలియటంలేదు. శ్రీకృష్ణజన్మఖండం రాధికాపరిణయాలు ప్రౌఢరచనలు.

2) యనమండ్రం వెంకటరామయ్యగారి పురాణనామ చంద్రికలో బ్రహ్మవైవర్త ఇది ఒక పురాణము. ఇది వశిష్ఠ ప్రోక్తము (సప్త) సృష్టి వివరణ విష్ణు ధర్మాదులు ఇందు చెప్పబడినవి. దీని గ్రంథ సంఖ్య 18000 అని చెప్పబడింది.

బ్రహ్మవైవర్త ఖండంలోని శ్రీకృష్ణజన్మఖండాన్ని కుందోర్ఘుల గోపాలస్వామి తెనిగించినట్లు ఉన్నది. దీని తాళపత్ర ప్రతి ఆంధ్రప్రదేశ్ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం హైదరాబాద్‌లో 4663 క్రమసంఖ్యలో ఉన్నది. బహుశః కవి ఇంటిపేరు కుందోర్ఘులకాక కుందావఝుల కావచ్చును. ఈ గ్రంథం గురించిన మిగిలిన వివరాలు తెలియరావు.

ఇప్పటికి 11 పురాణాల వచనానుసరణలు పురాణ భారతీ సిరీస్‌లో భాగంగా ప్రచురింపబడ్డాయి. పన్నెండవదిగా ఈ శ్రీ బ్రహ్మవైవర్త పురాణం ప్రచురింపబడుతున్నది. ఈ మహత్కార్యాన్ని శ్రద్ధగా నిర్వహిస్తున్న విజయవాడ శ్రీ విక్టరీ పబ్లిషర్సు, అధినేత ఇమ్మడిశెట్టి రామకుమార్ గారికి అనేక నమస్కారాలు తెలుపుతున్నాను. వారికి వారి కుటుంబానికి శ్రియఃపతి ఆయురారోగ్యభాగ్యాలను కలిగించాలని ఆ భగవంతునికి విన్నపం.

ఈ క్రమంలో వచ్చిన మిగిలిన పురాణాలవలెనే ఈ పురాణాన్ని తెలుగు ప్రజలు ఆదరిస్తారని విశ్వాసం, ఆదరించాలని విన్నపం. అనేక నమస్కారాలతో.....✍

విధేయుడు

**ఆవంచ సత్యనారాయణ**

ఓం గణేశాయ నమః
ఓం నమో భగవతే వాసుదేవాయ

# శ్రీ బ్రహ్మవైవర్త మహాపురాణము

## ప్రథమ ఖండము - బ్రహ్మ ఖండము

### 1/1 - అనుక్రమణిక

**గణేశ బ్రహ్మేశ సురేశ శేషాః సురాశ్చ సర్వే మునవోమునీంద్రాః**

**సరస్వతీ శ్రీగిరిజాది కాశ్చయం నమంతి దేవ్యః ప్రణమామితంకి భుం**

గణపతి, బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు, ఆదిశేషుడు మొదలైన దేవతలు, మనువు మొదలైన మహర్షులు, శ్రీదేవి, పార్వతి, సరస్వతి మొదలైన స్త్రీ దేవతలు ఎవరికి ఎల్లప్పుడు నమస్కరింతురో అట్టి శ్రీకృష్ణునికి నమస్కరించుదును.

త్రిగుణ స్వరూపుడు, మహత్స్వరూపుడు, ఆద్యుడైన శ్రీకృష్ణుడు సృష్టిచేయదలిచి తన రోమ కూపములలో సమస్త లోకములను, స్థూల శరీరములను ఏర్పరచుచు తన మాయతో సూక్ష్మ స్వరూపమును కూడ సృష్టించెను. అట్టి పరబ్రహ్మ రూపుడైన శ్రీకృష్ణుని నా నమస్సులో సదా ధ్యానించుదును.

ధ్యానైక నిష్ఠులైన దేవతలు, మునులు, మానవులు, యోగులు, ఏ పరమేశ్వరుని ఎల్లప్పుడు ధ్యానించినను, ఎన్ని జన్మలకైనను స్వప్నములో కూడా ఆయనను చూడలేక పోవుచున్నారో, అట్టి త్రిగుణాతీతుడు, నిర్వికారుడు, కోరికలు ఏ మాత్రము లేని ఆ పరమపురుషుడు భక్తులు ధ్యానించు కొనుటకు అనుకూలముగా మిక్కిలి సుందరమైన నల్లని రూపును ధరించుచున్నాడో అట్టి స్వేచ్ఛామయుడైన శ్రీకృష్ణ దేవుని భక్తితో ధ్యానించుదును. బ్రహ్మ, అచ్యుతాదుల కంటెను విశిష్టుడు,

త్రిగుణాతీతుడు అయిన ఆ శ్రీకృష్ణ పరబ్రహ్మము నుండి ప్రకృతి, బ్రహ్మ, విష్ణువు, శివుడు మొదలగువారు ఉద్భవించిరి. అట్టి శ్రీకృష్ణ తత్త్వమునకు నేను నమస్కరించుదును.

**నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమం**

**దేవీం సరస్వతీం వ్యాసంతతో జయము దీరయేత్**

**అమృత పరమ పూర్వం భారతీ కామధేనుం**

**శ్రుతి గణకతవత్సో వ్యాసదేవో దుదాహ**

**అతిరుచిర పురాణం బ్రహ్మవైవర్తమేతత్**

**పిబత పిబత ముగ్ధా రుగ్ధ మక్షయ్య మిష్టం**

నారాయణునికి నరుడను మునికి, సరస్వతికి, వ్యాసునికి నమస్కరించి "జయ" అను పేరుగల బ్రహ్మ వైవర్త మహాపురాణమును చెప్పెదను. 'జ' అనగా 8. 'య' అనగా ఒకటి – అంకానాం వామతో గతిః అను సూత్రమును అనుసరించి 'జయ' అనగా 18. పద్దెనిమిది పురాణములలో ఒకటైన శ్రీ బ్రహ్మ వైవర్త మహాపురాణమును వివరించుదును.

శ్రీ వేదవ్యాసుడు వేదములను దూడగాచేసి, భారతి అను కామధేనువును పితుకగా వచ్చిన అపూర్వము, అమృతమయము, పురాణములలో చాలా ఇంపైన బ్రహ్మవైవర్త పురాణమను క్షయములేని పాలను మిక్కిలి ఇష్టముగా త్రాగుడు.

భరత ఖండములోని నైమిశారణ్యములో శౌనకాది మహర్షులు నిత్య నైమిత్తిక క్రియలు పూర్తి చేసికొని దర్భాసనములపై కూర్చొని ఉండిరి.

ఆ సమయములో అనుకొనకుండా అక్కడికి వచ్చిన సౌతిని (సూతమహర్షి వంశజుడైన రోమహర్షణి మహర్షిని) చూచి శౌనకాది మునులు ఆసనమును కల్పించిరి.

(పృథు చక్రవర్తి యజ్ఞములు చేయుచున్నప్పుడు శ్రీమహావిష్ణువే సూతుడనే పేరుతో పురాణ కథలను చెప్పినట్లు, అతని వంశమున పుట్టిన వారినందరిని సూతుడను పేరుతోనే పిలుచునట్లు బ్రహ్మాండ పురాణము తెల్పుచున్నది. వ్యాస మహర్షి శిష్యులలో ఒకడైన రోమహర్షణి ముని పురాణములను అన్నింటిని శౌనకాది మహర్షులకు వినిపించెను.)

అతిథిగా వచ్చిన ఆ సౌతి మునిని శౌనక మహర్షి గౌరవించి ఇట్లు కుశలప్రశ్న వేసెను.

మార్గాయాసము తొలగిన పిమ్మట స్థిరాసనమున ఉన్నవాడు, సమస్త తత్త్వములు తెలిసిన వాడు, ప్రాచీనములైన పురాణములన్నియు తెలిసిన ఆ సౌతిమహర్షిని మునుల సభలో శౌనకముని ఈ విధముగా ప్రశ్నించెను.

సమస్త శ్రుతి సమ్మతము, మంగళప్రదము అమంగళములను అన్నిటిని తొలగించునది, సమస్త సంపదలను కలిగించునది, హరియందు భక్తిని, శాశ్వత సుఖములను, మోక్షమును, తత్త్వ జ్ఞానమును కలిగించునది, భార్యా పుత్ర పౌత్ర సంపదలను అభివృద్ధి చేయునది, కృష్ణకథా సమన్విత

మైన పురాణమును వినగోరి, ఆకాశమునందున్న నక్షత్రములలో చంద్రునివంటి శౌనకమహర్షి ఇట్లు అడిగెను.

**శౌనకమహర్షి ఇట్లు పలికెను :**

మీరు ఎచ్చటికి వెళ్ళుచున్నారు. ఎక్కడినుండి వచ్చుచున్నారు. మీకు మంగళము అగుగాక. మీ దర్శనము వలన మాకు ఈ దినము సుదినము. మేము విజ్ఞాన రహితులము. సంసార సాగరమున మునిగి ఉన్నాము. కలియుగములో ఉన్నందువలన కలియుగ ధర్మముల నుండి భయపడి మోక్షమును కోరి ఉన్నాము. మీరు మమ్ము సుజ్ఞానులనుచేసి మోక్షము కలిగించుటకు ఇచ్చటికి వచ్చి ఉండిరి. మీరు సాధువులు శ్రేష్ఠులు. సమస్త పురాణములను ఎఱిగినవారు. మిక్కిలి దయగలవారు.

కర్మబంధములను సమూలముగా నిర్మూలము చేయగల్గినది, సంసారబద్ధులైనవారి సంకెళ్ళను ఛేదించకల్గినది, సంసారమను కారుచిచ్చున బడి దగ్ధమగుచున్నవారిపై అమృత వర్షమును వర్షించునది, ఆనందమును, సుఖమును ఎల్లప్పటికి కల్గించునది అయిన శ్రీకృష్ణభక్తి దేనివలన కలుగునో అట్టి పురాణమును మాకు చెప్పవలెనని మా ప్రార్థన.

తొలుత సమస్తమునకు కారణమైన 'బ్రహ్మ' నిరూపణము, చరాచర జగత్తును సృష్టించదలచిన పరబ్రహ్మయొక్క సృష్టి వివరణ, సాకారము, నిరాకారము అయిన ఆ పరమాత్మ స్వరూపమును, ఆ పరమాత్మను ధ్యానము చేయు విధము, వైష్ణవులు, యోగులు ఎవని ధ్యానింతురో, వేదప్రోక్తమైన వారి మతము, ప్రకృతి స్వరూపము, సత్వ రజ స్తమో గుణముల లక్షణము, పృథివి మొదలగు పంచ భూతములు, వాటి తన్మాత్రలు, మహత్తు మొదలైన వాటి వివరణ, గోలోక వర్ణన, వైకుంఠ వర్ణన, శివలోక వర్ణన, ఇంకను స్వర్గలోక వర్ణన, ప్రాకృతులు, ప్రకృతికన్న భిన్నమైన ఆత్మ స్వరూప వివరణ, దేవతలు, దేవతాస్త్రీలు, సముద్రములు, పర్వతములు నదులయొక్క ఉత్పత్తి, దుర్గ, లక్ష్మి, సావిత్రి, సరస్వతుల వర్ణన, వారి ధ్యానము, పూజా స్తోత్రాదికములు, అమృతప్రాయమైన రాధాదేవి చరిత్ర, నరక వర్ణన, జీవులు ఏ ఏ స్థానములందు ఉందురో ఆయా స్థాన వర్ణన, జీవులు తాము చేయు శుభాశుభ కర్మలను అనుసరించి ఏ ఏ యోనులలో పుట్టునో, ఏ ఏ రోగములను పొందునో, ఆయా కర్మల నుండి మోక్షము పొందు విధము, చెప్పబడినట్టి పురాణమును మాకు విపులముగా తెలుపుడు.

మనస, తులసి, కాళి, గంగ, పృథివి, ఇంకను ఇతర దేవతల కథలు, శాలిగ్రామ శిలలను గూర్చి, వాటిని దానము చేయుటవలన కలుగు ఫలితములు, ధర్మాధర్మముల వివరణ, గణపతి చరిత్ర, కవచము, స్తోత్రములు, నిగూఢమైన మంత్రములు మొదలగువాని వివరణ, ఇంతవరకు ఎన్నడు విననివి, అపూర్వము, అత్యద్భుతమైన ఉపాఖ్యానములుగల పురాణము అంతయు మాకు చెప్పవలసినది.

భారతదేశ మందలి పరమాత్మయైన శ్రీకృష్ణుడు జన్మించిన పుణ్యక్షేత్రమును, ఏ పుణ్యవంతుని పవిత్రమైన గృహమున ఆ పరమాత్మ పుట్టినాడో, పూజనీయురాలు, సతి అగు ఏ పుణ్యవతి

ఆయనను కన్నదో, ఆ పరమాత్మ జన్మించిన స్థలమునుండి ఏ కారణమున బయటికి వెళ్ళెనో, అచ్చట ఏ ఏ కార్యములు చేసెనో, మరల ఎట్లు తాను పుట్టిన చోటికి తిరిగి వచ్చెనో, ఎవరి ప్రార్థన వలన భూ భారమును తగ్గించెనో, ఏ ఏ కార్యములు చేసి తిరిగి గోలోకమునకు వెళ్ళెనో, శ్రుతి దుర్లభము, మునులకు సైతము తెలియరానిది, మనస్సును తేలికపరచు ఈ కథను, ఇతర కథలను తెలిసి తెలియక నేను అడిగిన వానిని, అడుగని వాటిని సద్యోవైరాగ్యమును ఇచ్చు ఆ పరమాత్మ కథలను విపులముగా వ్యాఖ్యానించ ప్రార్థన.

యోగ్యాయోగ్య విషయములయందు ఎవరు సమదృష్టి కలిగి ఉందురో, శిష్యులు అడిగినను, అడుగక పోయినను వారికి అవసరమైన విషయములను వ్యాఖ్యాన పూర్వకముగా ఎవరు తెల్పుదురో, అతడు సజ్జన శ్రేష్ఠుడు. సద్గురువు.

**సౌతి మహర్షి ఇట్లు పలికెను :**

శౌనక మహర్షీ ! మీ పాద పద్మములను దర్శించుటచేత మేము కుశలముగా ఉన్నాము. నేను సిద్ధ క్షేత్రము నుండి నారాయణ క్షేత్రమైన బదరికా వనమునకు పోవుచున్నాను. భరత ఖండమున పుణ్యప్రదమైన నైమిశారణ్యమును చూచుటకు ఇచ్చటికి వచ్చితిని. ఇచ్చటి విప్ర సమూహమును చూచి నమస్కరించు భావనతో చేరుకొంటిని.

తొందరపాటు వలన దేవతలను, విప్రులను గురువును చూచి ఎవరు నమస్కరించరో వారు సూర్య చంద్రులు ఉన్నంతవరకు నరకమున ఉందురు.

శ్రీమన్నారాయణుడు బ్రాహ్మణ రూపమున భూమిపై సంచరించును. కావున పుణ్యవంతుడు హరిరూపమున ఉన్న బ్రాహ్మణునికి తప్పక నమస్కరింపవలెను.

పూజ్యుడా ! మీ అభీప్సితము నాకు బాగుగా తెలిసినది. మీరు అడిగినవి అన్నియు బ్రహ్మవైవర్త మహాపురాణ మున కన్పించును. ఆ పురాణము, పురాణములకు అన్నిటికి సారభూతమైనది. అది పురాణ, ఉపపురాణములు వేదములయందు మనకున్న సంశయములను పోగొట్టును. కోరినవారికి ఐహిక కామములను, మోక్షార్థులకు మోక్షమును, విష్ణు భక్తులకు భక్తిని కల్పవృక్షమువలె ఇచ్చును.

బ్రహ్మ వైవర్త మహాపురాణము నాలుగు ఖండములుగా విభజింపబడినది. వాటిలో తొలి ఖండమైన బ్రహ్మఖండమున యోగులు, సంతులు, వైష్ణవులు ఏ పరమాత్మను నిత్యము ధ్యానింతురో, సమస్త సృష్టికి కారణభూత మైన ఆ పరమాత్మ నిరూపణము చేయబడినది.

సంతులు, యోగులు, విష్ణు భక్తులు ముగ్గురు వేరువేరని తలపరాదు. వారివారి జ్ఞాన పరిపాకము వలన జీవులు మూడు విధములుగా చెప్పబడుచున్నారు.

సత్సంగము చేసిన వారిని సంతులని, యోగులతో కలిసి ఉన్నవారిని యోగులు అని, భక్తులతో కలిసి తిరుగు వారిని విష్ణు భక్తులకు చెప్పుదురు.

రెండవ ఖండమైన ప్రకృతి ఖండములో దేవతలు, సమస్త జీవుల జన్మ వృత్తాంతమును దేవతా కవచములు, స్తోత్రములు, మంత్రములు పూజచేయు పద్ధతి, జీవుల కర్మవిపాకము, శాలి

గ్రామములు, ప్రకృతియొక్క లక్షణము, పుణ్యవంతులు, పాపులు పొందు శుభాశుభ స్థానములు, నరక వర్ణన, రోగములు, వాటి నివారణ రీతులు చెప్పబడినవి.

తృతీయ ఖండమైన గణేశ ఖండమున అపూర్వము, వేదములయందు చెప్పబడని గణపతి చరిత్ర వర్ణించ బడినది. అందలి గణేశ భృగు సంవాదమున సమస్త తత్త్వనిరూపణ, గణపతియొక్క కవచము, స్తోత్రములు, మంత్రముల వివరణ కన్పించును.

చివరిదైన శ్రీకృష్ణ జన్మ ఖండమున శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతము, భూమియొక్క భారమును తగ్గించుటకు అతడు చేసిన క్రీడలు, సజ్జనులకు ఆతడు చేసిన మంగళ కార్యములు వర్ణింపబడినవి.

శౌనక మహర్షీ ! ఈ బ్రహ్మ వైవర్త పురాణము సమస్త ధర్మములను నిరూపించునట్టిది, బ్రహ్మ ఖండము మొదలైన నాలుగు ఖండములతో కూడుకున్నది. అందరి కోరికలను తీర్చునది, సంపత్కరము. ఈ పురాణము సమస్త పురాణముల సారభూతము, వేద సమ్మితము కూడ. ఇందు శ్రీకృష్ణునిచేత బ్రహ్మ స్వరూపము అంతయు వివరించబడి ఉన్నందున దీనిని బ్రహ్మవైవర్తమని ప్రాచీనులు చెప్పుచున్నారు.

ఈ పురాణముయొక్క ఆచార్య పరంపర ఈ విధముగా కలదు.

ఈ పురాణము శ్రీకృష్ణ పరమాత్మచే గోలోకమున బ్రహ్మదేవునికి ఎఱింగించబడినది. బ్రహ్మదేవుడు పుష్కర తీర్థమున ధర్మునకు దీనిని తెలిపెను. ధర్ముడు బ్రహ్మ పుత్రుడైన నారదునకు, నారాయణునకు చెప్పెను. నారద మహర్షి గంగానదీ తీరమున వ్యాస మహర్షికి చెప్పెను. వ్యాసుడు విపులమైన ఈ పురాణమును చక్కగా విభజించి పుణ్య ప్రదేశమైన సిద్ధ క్షేత్రమున నాకు తెల్పెను. శౌనకమహర్షీ ! నేను నీకు ఇప్పుడు దీనిని చెప్పుచున్నాను. ఇట్లు ఆచార్య పరంపరతో కూడుకొని ఉన్న ఈ పురాణమును అంతయు నీవు శ్రద్ధగా వినుము.

వ్యాస మహర్షిచే 18,000 శ్లోకములతో ఈ పురాణము చెప్పబడినది. (కాని ప్రస్తుతము ఈ పురాణమున 20 వేలకుపైగా శ్లోకములు ఉన్నవి. అనగా వ్యాసకృత బ్రహ్మ వైవర్తమును సౌతి మహర్షి పెంచి శౌనకాదులకు వివరించినట్లుగా ఉన్నది. అందువల్లనే శ్రీ సౌతిమహర్షి వ్యాసకృతమైన బ్రహ్మ వైవర్తమును 'పురాణకం' (చిన్న పురాణము) అని అనెను.

పురాణములను అన్నిటిని వినిన ఏ ఫలితము లభించునో ఇందలి ఏ ఒక్క అధ్యాయమును విన్నను అంతటి ఫలితము లభించగలదు. (1/1)

## 1/2 - పరబ్రహ్మ నిరూపణము

**శౌనక మహర్షి ఇట్లు చెప్పెను :**

ఓ సౌతి మహర్షీ ! అపూర్వము, అత్యద్భుతము ఉత్తమోత్తమము అయిన ఆ బ్రహ్మ ఖండమును వివరించి పూర్తిగా చెప్పవలసినది.

**సౌతి మహర్షి ఇట్లు పలికెను :**

అత్యంత తేజస్సంపన్నుడు, నాకు గురువు అయిన వ్యాస మహర్షి పాదపంకజములకు, శ్రీహరికి, ఇతర దేవతలకు బ్రాహ్మణోత్తములకు నమస్కరించి సనాతనములైన ధర్మములను చెప్పుదును.

మిక్కిలి శ్రేష్ఠమైనది, అజ్ఞానము అను చీకటిని నాశనము చేయునది, జ్ఞాన మార్గమును చూపించునది అయిన బ్రహ్మ ఖండమును నా గురుదేవులైన వ్యాస మహర్షి వలన వింటిని. దానిని ఇప్పుడు చెప్పుదును.

ప్రళయ కాలమున సృష్టికి కారణము అయినదియు కోటి సూర్యుల కాంతితో సమానమైన కాంతికలదియు, నిత్యమైనది, అసంఖ్యాకమైన తేజః పుంజము మాత్రమే ఉండినది.

ఉజ్వలమైన ఆ జ్యోతి, స్వేచ్ఛామయుడైన పరమ పురుషునిది. ఆ జ్యోతిఃపుంజము మధ్య స్వర్గ, మర్త్య, పాతాళములు అను మూడు లోకములు కలవు. ఆ ముల్లోకములకు పైన నాశనములేని గోలోకము ఉన్నది. ఆ గోలోకము మూడు కోట్ల యోజన పరిమితమైనది. గుండ్రముగా ఉన్నది. చాలా విలువకల రత్నములు పరచి ఉన్నది. తేజః స్వరూపమైన ఆ గోలోకమును యోగులు కలలో సైతము చూడలేరు. కాని విష్ణు భక్తులకు అది స్పష్టముగా కనిపించును. వారు తమ అనన్యమైన భక్తివలన ఆ లోకమును పొందుదురు. అంతరిక్షములో ఉన్న ఆ లోకము పరమపురుషుడైన శ్రీకృష్ణునిచే యోగశక్తి వలన ధరించబడినది. ఆ లోకమున మనో వ్యథలు, వ్యాధులు, ముసలితనము, చావు, శోకము, భయము కనిపించవు. మంచి రత్నములతో కట్టబడిన అసంఖ్యాకమైన భవనములు ఉన్నవి. ప్రళయ కాలమున శ్రీకృష్ణుడు మాత్రము ఉండగా, సృష్టి కాలమున గోప, గోపికలతో శోభితమై ఉండును.

ఆ గోలోకమునకు క్రింది భాగమున కుడి ఎడమ భాగములలో వైకుంఠము, శివలోకము కలవు.

అందు వైకుంఠము కోటి యోజన విస్తీర్ణమై, మండలాకారమున ఉండును. ఆ లోకము లయ కాలమున శూన్యమై ఉండును. సృష్టి కాలమున నాల్గు భుజములతో ఉన్న సహచరులుకల లక్ష్మీనారాయణులతో కనిపించును. అచ్చట ముసలితనము, చావు, ఆధి వ్యాధులు మొదలైనవి మచ్చుకైనా కన్పించవు.

వైకుంఠమునకు ఎడమ ప్రక్కనున్న శివలోకము కోటి యోజన పరిమితమైనది. ఆ లోకము సహితము లయ కాలమున శూన్యముగా ఉండి, సృష్టి కాలమున సహచరులతో ఉన్న పార్వతీపరమేశ్వరులతో ఉండును.

గోలోకమున ఉన్న జ్యోతి మిక్కిలి మనోహరమైనది. ఆహ్లాదమును, శాశ్వతమైన పరమానందమును కల్గించును. యోగులు ఎల్లప్పుడు తమ యోగమువలన కలిగిన జ్ఞాన నేత్రము ద్వారా దానిని దర్శింతురు. ఆ జ్యోతిస్సు యొక్క మధ్య భాగమున ఉన్న రూపము చాలా అందమైనది. ఆ రూపము నూతన మేఘమువలె నల్లనైన, ఎఱ్ఱని కలువలవంటి కన్నులతో, శరత్కాల పౌర్ణమినాటి

చంద్రునివలె నిర్మలమైన ముఖముతో, కోటి మన్మథుల లావణ్యము కలిగి, మిక్కిలి అందముగా కన్పించును. ఇంకను అది రెండు భుజములతో ఒకచేత మురళిని పట్టుకొని, చిరునవ్వుతో కూడిన ముఖముతో, పచ్చని బట్టలతో, ఉత్తమమైన రత్న భూషణములతో అలంకరింపబడి, శరీరమునందు అంతటను శ్రీచందనమును పులుముకొని ముఖమున కస్తూరీ కుంకుమతో ఉన్న బొట్టుతో కనిపించును. రొమ్ముపై శ్రీవత్సము, కౌస్తుభమణి ఉండును. శిరస్సుపై మంచి రత్నములతో అలంకరింపబడిన కిరీటము ఉండును. వనమాలా భూషితమై రత్న సింహాసనమున ఉన్న ఆ రూపమే సనాతనమైన పరబ్రహ్మగా భగవంతుడుగా కీర్తింపబడుచున్నది.

స్వేచ్ఛామయుడు, సమస్తమునకు కారణభూతమైనవాడు, సృష్టి సమస్తమునకు ఆధార భూతుడు, ఎల్లప్పుడు గోప వేషమున ఉండువాడు, భక్త అనుగ్రహకారకుడు, కోటిపూర్ణ చంద్రుల శోభ కలవాడు, కిశోర వయసులో ఉన్నవాడు ఆ పరబ్రహ్మ. స్వార్థమైన కోరికలు లేనివాడు, నిర్వికారుడు, సర్వ పరిపూర్ణుడు, రాసమండల మధ్య భాగమున ఉన్నవాడు, రాసేశ్వరుడు, శాంతుడు, మంగళ స్వరూపుడు, మంగళప్రదుడు, పరమానందకారకుడు, సత్య స్వరూపుడు, అక్షరుడు, అన్వయుడు, సర్వసిద్ధులకు అధీశుడు సర్వ సిద్ధి స్వరూపుడు, సమస్త సిద్ధులను ఇచ్చువాడు ఆ పరబ్రహ్మయే. ప్రకృతికి అతీతుడు, ఈశ్వరుడు, నిర్గుణుడు, ఆదిపురుషుడు, అవ్యక్తుడు స్వతంత్రుడు అద్వితీయుడు అయిన ఆ పరమాత్మను శాంతాత్ములైన వైష్ణవులు సదా ధ్యానింతురు.

ఇట్టి పర రూపమును ధరించు ఆ భగవంతుడు దిక్కులు ఆకాశముతో ఉన్న విశ్వమంతయు శూన్యముగా ఉన్నట్లు చూచెను. (1/2)

## 1/3 - సృష్టిక్రమ నిరూపణము

**సౌతి మహర్షి ఇట్లు చెప్పెను :**

స్వేచ్ఛామయుడు, అసహాయుడు, ప్రభువు అయిన శ్రీకృష్ణుడు శూన్యమైన విశ్వము, భయంకరముగా ఉన్న గోలోకము జంతువులు, జలములు, వాయువు, వృక్షములు, పర్వతములు, సముద్రములు, ధాతువులు, సస్యములు, తృణములు లేక వికృతముగా ఉండగా సమస్తమును మనస్సులో ఆలోచించి, స్వేచ్ఛతో సృష్టించుటకు ప్రారంభించెను.

సృష్టియొక్క ప్రారంభ సమయమున పరమ పురుషుడైన శ్రీకృష్ణుని యొక్క కుడి ప్రక్కనుండి సంసారమునకు మూల హేతువులైన సత్వ రజ స్తమస్సులు అను త్రిగుణములు పంచవింశతి (ఇరవై అయిదు) తత్త్వములకు చెందిన మహతత్త్వము, అహంకారము, గంధ, రస, రూప, స్పర్శ, శబ్దములు అను పంచ తన్మాత్రలు ఆకారమును ధరించి పుట్టినవి.

ఆ తర్వాత శ్యామమూర్తి, యువకుడు, పీత వస్త్రములు ధరించినవాడు, వనమాలను ధరించినవాడు, చతుర్భుజుడు, శంఖ, చక్ర, గధా, పద్మ ఆయుధములు ధరించినవాడు చిరునవ్వుతో కూడిన ముఖ పద్మము కలవాడు, రత్న భూషణములు, కౌస్తుభమణి, శార్ఙ్గము అనే ధనుస్సు

ధరించినవాడు, వక్షస్థలమున శ్రీవత్సము కలవాడు, లక్ష్మీనివాసుడు, శరత్కాల చంద్రుని కాంతిని మరుగుపరచు ముఖచంద్రునివలన అందమైనవాడు, మన్మథుని కన్నను సౌందర్యమున మిన్నయైన రూపలావణ్యము కలవాడు అగు నారాయణమూర్తి స్వయముగా ఆవిర్భవించెను. ఆ నారాయణమూర్తి శ్రీకృష్ణ దేవుని ముందర నిలిచి చేతులు జోడించి ఇట్లు స్తుతించెను.

**శ్రీనారాయణుడు ఇట్లు పలికెను :**

శ్రేష్ఠుడు, ప్రధానమైనవాడు, వరములను ఇచ్చువాడు, వరములను ఇచ్చుటకు అర్హుడు, కారణములకు కారణమైనవాడు, కర్మ స్వరూపుడు, ఆయా కర్మలకు కారణభూతుడు, తపస్స్వరూపుడు, ఆయా తపస్సుల ఫలితమును ఇచ్చువాడు, సదా తపస్వి అయినవాడు, ఈశుడు, నూతన మేఘమువలె నల్లనివాడు, స్వాత్మయందును ఉండువాడు, మనస్సును హరించువాడు, నిష్కాముడు, కామస్వరూపుడు, కామమును పోగొట్టువాడు, కోరికలకు కారణభూతుడు, సర్వస్వరూపి, సర్వేశ్వరుడు సమస్తమునకు కారణమైనవాడు, వేదరూపుడు, వేదవాచ్యుడు, వేదములందు చెప్పబడిన ఫలితములను ఇచ్చువాడు, ఫలస్వరూపుడు, సమస్త వేదములు తెలిసినవాడు, సమస్త వేదములు తెలిసిన వారిలో శ్రేష్ఠుడును అయిన నిన్ను ఎల్లప్పుడు నేను ప్రార్థించుదును.

అని ఈ విధముగా భక్తితో కూడుకున్న ఆ నారాయణుడు శ్రీకృష్ణ పరమాత్మ ఆజ్ఞను అనుసరించి ఆ పరమాత్మకు ముందున్న రత్న సింహాసనమున కూర్చుండెను.

శ్రీమన్నారాయణుడు చేసిన ఈ స్తోత్రమును శ్రద్ధా భక్తులతో నియమముతో గూడి త్రిసంధ్యలలో ఎవరు పఠింతురో, ఎవరు ఇతరులు చదువగా విందురో, వారికి పాపము ఉండదు. పుత్రులనుకోరి ఈ స్తోత్రము చేసినచో, విన్నచో వారికి తప్పక పుత్రులు కలుగుదురు. భార్య (వివాహము) కావలెను అను కొన్నచో భార్య లభించును. రాజ్య భ్రష్టునికి రాజ్యము లభించును. ధనహీనుడు ధనమును పొందును. ఆపదలలో ఉన్నను కారాగారములో పడినను ఈ స్తోత్రము వలన తప్పక విముక్తుడు అగును. రోగపీడితుడైనను ఈ స్తోత్ర శ్రవణము వలన రోగములను పోగొట్టుకొనును.

**సౌతి మహర్షి ఇట్లు పలికెను :**

ఆ పరమాత్మ ఎడమ భాగమున శుద్ధ స్ఫటికమువలె ఉన్నవాడు, ఐదు శిరస్సులు కలవాడు దిగంబరుడు, మిక్కిలి పరిశుద్ధమైన బంగారు కాంతిగల జడలు ధరించినవాడు, చిరునవ్వుగల ముఖముతో ఉన్నవాడు, మూడు కన్నులు గలవాడు, శిరస్సున చంద్రుడున్నవాడు, చేతిలో జపమాల కలవాడు, సమస్త సిద్ధులకు ఈశ్వరుడు, స్వయముగా సిద్ధుడు, యోగీంద్రులకు, గురువుకు గురువైనవాడు, మృత్యువుకు మృత్యువు, ఈశ్వరుడు, మృత్యుంజయుడు, శివస్వరూపుడు, జ్ఞానానందుడు, కాంతికన్నను మిన్నయైన చంద్రుని వంటి ముఖము కలవాడు, విష్ణు భక్తులకెల్ల శ్రేష్ఠుడు అగు మహాదేవుడు బ్రహ్మ తేజస్సుతో ప్రకాశించుచు శ్రీకృష్ణ దేవుని ముందు నిలిచి పులకించిన అవయవములు కలవాడై కన్నీళ్ళు కారగా మిక్కిలి గద్గద స్వరముతో ఆ పరమాత్మను ఇట్లు స్తోత్రము చేసెను.

**శ్రీమహాదేవుడు ఇట్లు పలికెను :**

జయ స్వరూపుడు, జయమును కల్గించువాడు, జయేశుడు, జయకారకుడు, జయమును కల్గించువారిలో శ్రేష్ఠుడు, విశ్వస్వరూపుడు, విశ్వేశ్వరులకు ఈశ్వరుడు, విశ్వ సృష్టికి కారకుడు, విశ్వమునకు ఆధారభూతుడు, విశ్వకారణ కారణుడు, ఈ ప్రపంచమును రక్షించువాడు, లయమును చేయువాడు, విశ్వమునందు పుట్టినవాడు, ఫలకారకుడు, ఫలమునకు ఆధారభూతుడు, ఫల స్వరూపుడు ఆయా ఫలితములను ఇచ్చువాడు, తేజః స్వరూపుడు, తేజస్సును కలిగించువాడు, సమస్త తేజోవంతులలో శ్రేష్ఠుడు, అపరాజితుడు అగు శ్రీకృష్ణ దేవునికి నమస్కరింతును.

అని ఈ విధముగా స్తుతించి, ప్రక్కన ఉన్న నారాయణమూర్తిని పలుకరించి, ఆ శ్రీకృష్ణ దేవుని ఆజ్ఞను అనుసరించి శ్రేష్ఠమైన రత్న సింహాసనమున కూర్చుండెను.

మహాదేవుడు చేసిన ఈ శ్రీకృష్ణ స్తోత్రమును ఎవరు నియమముతో చదువుదురో వారికి అన్ని సిద్ధులు కలుగును. ఎల్లప్పుడు విజయము కలుగుచుండును. స్నేహితులు, ధనము, ఐశ్వర్యము కూడ కలుగును. శత్రు సైన్యములు నశించును. దుఃఖము, పాపముకూడ నశించును.

బ్రహ్మవైవర్త మహాపురాణములో శ్రీ శంభువు చేసిన ఈ శ్రీకృష్ణ స్తోత్రము సంపూర్ణము.

**సౌతి మహర్షి ఇట్లు పలికెను :**

ఆ తర్వాత శ్రీకృష్ణ దేవుని నాభి పంకజమునుండి మహాతపస్వి, వృద్ధుడు, హస్తమున కమండలము కలవాడు, శ్రేష్ఠుడు, తెల్లని వస్త్రములు, దంతములు, వెంట్రుకలు కలవాడు, యోగులకు, శిల్పులకు ఈశ్వరుడు, సమస్త ప్రాణి కోట్లకు జనకుడు, గురుడు, తపః ఫలితములను, సర్వసంపదలను ఇచ్చువాడు, సృష్టికర్త, సమస్త కర్మలకు కర్త, విధాత, హర్త, నాల్గు వేదములను తన ముఖములందు ధరించినవాడు, నాల్గు వేదములు తెలిసినవాడు, వేదముల నుండి పుట్టిన వాటికి అధిపతి, శాంతుడు, మంచివాడు, అధికదయ కలవాడు, సరస్వతీదేవికి భర్త అయిన చతుర్ముఖ బ్రహ్మ ఆవిర్భవించెను. ఆతడు శ్రీకృష్ణ దేవుని ముందర నిలిచి చేతులు మోగిడ్చి, పులకించిన సమస్త శరీరముతో, భక్తితో వంగిన శిరస్సు కలవాడై ఇట్లు స్తుతించెను.

**బ్రహ్మదేవుడు ఇట్లు స్తుతించెను :**

గుణాతీతుడు, అద్వితీయుడు, నాశనములేనివాడు, వ్యక్తముకానివాడు, వ్యక్తుడు, వ్యయముకానివాడు, గోప వేషమును ధరించినవాడు, మనోహరుడు, నూతన మేఘమువలె నల్లనివాడు, కోటి మన్మథుల సౌందర్యము కలవాడు, బృందావనమున రాస మండలమున ఉన్నవాడు, రాసేశ్వరుడు, రాస క్రీడ ద్వారా ఉల్లాసము కలిగించు వాడు, ఆవులకు ఆనందమును కలిగించు శ్రీకృష్ణ దేవునికి నమస్కరింతును.

అని ఈ విధముగా శ్రీకృష్ణదేవుని స్తుతించి, సమీపమున ఉన్న ఈశ్వరుని, నారాయణుని పలుకరించి ఆ కృష్ణ దేవుని ఆజ్ఞపై రత్న సింహాసనమున కూర్చుండెను.

బ్రహ్మదేవుడు చేసిన ఈ స్తోత్రమును ఉదయమే లేచి ఎవరు చదువుదురో వారి పాపములు అన్నియు తొలగిపోవును. దుస్వప్నములు కలుగక, సుస్వప్నములే కలుగుచుండును. సంపదలు, పుత్రులు, పౌత్రులు కలిగించే గోవింద భక్తి కలుగును. అపకీర్తి నశించి సత్కీర్తి కలుగగలదు.

బ్రహ్మ వైవర్త మహాపురాణములో బ్రహ్మదేవుడు చేసిన ఈ శ్రీకృష్ణ స్తోత్రము సమాప్తము.

**సౌతి మహర్షి ఇట్లు పలికెను :**

ఆ తర్వాత పరమాత్మ వక్ష స్థలమునుండి తెల్లనివాడు జడలను ధరించినవాడు, అన్నిటికి సాక్షీభూతుడు, సర్వజ్ఞుడు, అందరియందు, అన్ని కర్మలలో సమదృష్టి కలవాడు, దయ కలవాడు, హింస, కోపము వదలినవాడు, ధర్మజ్ఞానము కలవాడు, ధర్మపరాయణుడు, ధర్మస్వభావమును కలిగించువాడు, ధర్మవంతులకెల్ల ధర్మవంతుడు చిరునవ్వుకల ధర్ముడు అను పురుషుడు ఉదయించెను. ఆ ధర్మదేవత శ్రీకృష్ణునిముందు దండప్రణామము ఒనరించి సర్వేశుడు, సమస్త కామితములను ఇచ్చు పరమాత్మను ఇట్లు స్తుతించెను.

**ధర్మదేవత ఇట్లు పలికెను :**

శ్రీకృష్ణుడు, విష్ణువు, వాసుదేవుడు, పరమాత్మ, ఈశ్వరుడు, గోవిందుడు, పరమానందుడు, అద్వితీయుడు, అక్షరుడు, అచ్యుతుడు, గోవులను కాచెడు గోపులకు నాథుడు, గోపికలకు నాథుడు, గోష్ఠమున ఉండువాడు, గోవత్స పుచ్ఛధారి, గో, గోప, గోపీ మధ్యస్థుడు, ప్రధానుడు, పురుషోత్తముడు అగు నీకు నమస్కరించుచున్నాను.

అని స్తుతించి, సమీపమున ఉన్న బ్రహ్మ విష్ణు శివులను పలుకరించి శ్రేష్ఠమైన రత్న సింహాసనమున కూర్చుండెను.

ధర్మదేవత చెప్పిన ఈ ఇరువదినాల్గు నామములను ఉదయమే లేచి చదువువారు సుఖముగా ఉందురు. అన్ని విధముల జయమును పొందుదురు. చనిపోవు సమయమున హరి నామస్మరణ తప్పక చేయగలుగుదురు. ధర్మము ఎల్లప్పుడు అతనిని అంటియుండును. అధర్మముపై అభిరుచి ఎన్నడును కలుగదు. ధర్మార్థ కామమోక్షములు అను చతుర్వర్గ ఫలము అతడి కరతలమున ఉండును. ఈ స్తోత్రము చదువువానిని చూచి సమస్త పాపములు, భయములు, దుఃఖములు గరుత్మంతుని చూచి పాములు పరుగెత్తినట్లు శీఘ్రముగ తొలగిపోవును.

బ్రహ్మ వైవర్త మహాపురాణమున ధర్మదేవత చేసిన ఈ శ్రీకృష్ణ స్తోత్రము సమాప్తము.

**సౌతి మహర్షి ఇట్లు పలికెను :**

ఆ తర్వాత పరమాత్మయగు శ్రీకృష్ణుని ముఖమునుండి ధర్మదేవత యొక్క ఎడమ భాగమున మూర్తీభవించిన రెండవ లక్ష్మివలె ఒక కన్య ఆవిర్భవించెను. అద్వితీయమగు ఆ దేవి శుక్ల వర్ణము కలది. వీణను పుస్తకమును చేతులలో ధరించినది. కోటి పూర్ణ చంద్రులవంటి కాంతికలది. శరత్కాలమందలి పద్మముల వంటి కన్నులుకలది. బంగారు వన్నెగల చీరను, రత్న భూషణములను

ధరించినది. చక్కని పలువరుస కలది. చిరునవ్వుతో నున్న ముఖము కలది. శ్యామ, సుందరాంగులలో సుందరి, వేదములకు, శాస్త్రములకు నిలయ, విద్వాంసులకు తల్లి వంటిది. వాక్కుకు అధిష్టానదేవత, కవులకు చాలా ప్రీతిపాత్రమైన దేవత. శుద్ధసత్వస్వరూప, శాంతరూపమగు సరస్వతి గోవిందుని ముందు నిలిచి భగవంతుని గుణములను కీర్తిని సుందరముగా పాడెను. తర్వాత ప్రతి కల్పమునందును యుగమునందును హరి యొనరించిన కర్మలను చక్కగా తన వీణపై ఆలపించి చేతులు జోడించుకొని ఇట్లు స్తుతించెను.

**సరస్వతీదేవి ఇట్లు పలికెను :**

రాసమండల మధ్యభాగమున ఉన్నవాడు, రాసోల్లాస సముత్సుకుడు, రత్న సిహాసనమందు ఉన్నవాడు, రత్నభూషణ, భూషితుడు, రాసేశ్వరుడు, రాసకరుడు, రాసేశ్వరీశ్వరుడు, రాసలీలకు అధిష్ఠాన దైవము, రాసక్రీడా వినోది, రాస క్రీడయందలి ఆయాసమువల్ల పరిశ్రాంతినందినవాడు, శాంతమైనవాడు, అందమైనవాడు అని స్తుతించి నమస్కరించినది. పిమ్మట ఆ సరస్వతీ దేవి పరమాత్మ ఆజ్ఞను అనుసరించి శ్రేష్ఠమైన రత్న సింహాసనమున కూర్చొనినది.

సరస్వతీదేవి చేసిన ఈ శ్రీకృష్ణ స్తోత్రమును ఉదయముననే లేచి ఎవరు చదువుదురో వారు బుద్ధిమంతులు, ధనవంతులు, విద్యావంతులు, పుత్రవంతులు కాగలరు.

**సౌతి మహర్షి ఇట్లు పలికెను :**

శ్రీకృష్ణదేవుని మనస్సునుండి రత్నాలంకారములు పీతాంబరము ధరించినది, చిరునవ్వుగల ముఖము కలది, నవయౌవనవతి, సమస్త ఐశ్వర్యములకు అధిదేవత, సమస్త సంపదల ఫలితములను ఇచ్చునది అగు ఒకదేవి విష్ణువుముందు నిలబడి భక్తిచే వంచిన తలకలదై నమస్కరించుచు ఇట్లు స్తోత్రము చేసెను.

**మహాలక్ష్మి ఇట్లు పలికెను :**

సత్య స్వరూపుడు, సత్యమునకు ఈశ్వరుడు, సత్యకారణుడు, సనాతనుడు, సత్యమునకు ఆధారభూతుడు, సత్యజ్ఞుడు, సత్యమూలుడు అగు శ్రీహరికి నమస్కరింతును అని శ్రీమహాలక్ష్మి స్వచ్ఛమైన బంగారము వంటి తన శరీర కాంతిచే అన్ని దిక్కులను ప్రకాశింపజేస్తూ శ్రీకృష్ణునికి నమస్కరించి సుఖాసనమున కూర్చుండెను.

ఆ తర్వాత శ్రీకృష్ణదేవుని బుద్ధినుండి సమస్తమునకు అధిష్ఠాతృదేవి, మూలప్రకృతి, ఈశ్వరి, మేలిమి బంగారము వంటి కాంతి కలది, కోటి సూర్యుల కాంతి కలది, చిరునవ్వుకల ముఖముకలది, శరత్కాల పద్మము వంటి కన్నులుకలది, ఎఱ్ఱని వస్త్రములు ధరించినది రత్నాభరణములు ధరించినది, నిద్ర, తృష్ణ, ఆకలి దప్పులు, దయ, శ్రద్ధ, క్షమ మొదలగు సర్వశక్తులకు అధిష్ఠాన దేవత, భయంకరమైనది, నూరు భుజములు కలది, కష్టసాధ్య, ఆర్తిని పోగొట్టునది, భగవంతుని శక్తి స్వరూప, లోకములకు అన్నిటికి మాతృస్వరూప, త్రిశూలము, శక్తి, శార్ఙ్గమనే ధనుస్సు, ఖడ్గము, బాణములు, శంఖము, చక్రము, గద, పద్మము, స్ఫటికమాల, కమండలువు, వజ్రము, అంకుశము,

పాశము, భుశుండి, దండము, తోమరము, నారాయణాస్త్రము, బ్రహ్మాస్త్రము,రౌద్రాస్త్రము, పాశుపతాస్త్రము, వాయవ్యాస్త్రము, వారుణాస్త్రము, ఆగ్నేయాస్త్రము, గాంధర్వాస్త్రమును ధరించుచున్న ప్రకృతి (దుర్గ) శ్రీకృష్ణుని ముందుండి ముదముతో ఇట్లు స్తుతించెను.

**ప్రకృతి దుర్గ ఇట్లు పలికెను :**

నేను ప్రకృతి స్వరూపిణిని, ఈశ్వరిని, సర్వేశ్వరిని, సమస్త రూపములు ధరించుదానను, సర్వశక్తి స్వరూపిణిని, నావలననే ఈ జగత్తంతయు శక్తిని కలిగి ఉన్నది. నేను నీచే సృష్టించబడిన దానను. అందువలననే స్వతంత్రురాలను కాదు. నీవే ఈ లోకములకెల్ల ఈశ్వరుడవు, గమ్యుడవు, సృష్టికర్తవు, సంహారకారకుడవు, పునః సృష్టికర్తవు, సృష్టికర్తలను సృష్టించువాడవు, సంహారకారకులను సంహరించువాడవు. పరమానంద స్వరూపుడవైన నీకు నమస్కరింతును. నీ కనురెప్పపాటు కాలములో బ్రహ్మ నశించును. అట్టి నీ ప్రభావమును ఎవరు వర్ణింపగలరు ? నీ కనుబొమల విరుపుతోనే కోటి సంఖ్యగల విష్ణువులను సృష్టించగలవు. బ్రహ్మ మొదలైన చరాచర జగత్తును సమస్త దేవతలను లీలగా సృజింపగలవు. మహత్స్వరూపము, విరాట్ స్వరూపము నీ కళలో ఒక చిన్న భాగము, పరిపూర్ణుడవు, పరమాత్మవు, ఈశ్వరుడవగు నీకు సంతోషముతో నమస్కరింతును. నిన్ను స్తుతించుటకు బ్రహ్మ విష్ణు శివాది దేవతలు, వేదములు, నేను, సరస్వతి, గొప్ప విద్వాంసులు సైతము శక్తులు కారు. నిరీహుడవగు నీకు నేను నమస్కరించుచున్నాను.

అని ఈ విధముగా దుర్గాదేవి శ్రీకృష్ణుని స్తుతించి, ఆ దేవునికి నమస్కరించి, శ్రేష్ఠమైన రత్నసింహాసనమున కూర్చుండెను. దుర్గాదేవి చేసిన స్తోత్రమునకు దేవతలందరును సంతోషించి ఆమెను పొగిడిరి.

శ్రీకృష్ణ పరమాత్మను గురించి దుర్గాదేవి చేసిన ఈ స్తోత్రమును పూజా సమయములో ఎవరు పఠింతురో వారు అన్ని ప్రదేశములలోను జయమును పొందుదురు. సుఖమును పొందుదురు. ఆతని ఇంటిని దుర్గాదేవి వదలి ఎచ్చటికి పోదు. ఆతడు ఈ జన్మలో కీర్తిని, మరణించిన తరువాత శ్రీహరి సాన్నిధ్యమును పొందును. (1/3)

## 1/4 - సావిత్రి, రతీమన్మథులు, వరుణుడు మొదలగువారి జననం

**సౌతి మహర్షి ఇట్లు పలికెను :**

ఆ తర్వాత శ్రీకృష్ణదేవుని నాలుకనుండి శుద్ధ స్ఫటికమువలె తెల్లనిది, అందమైనది, తెల్లని వస్త్రమును ధరించినది, సమస్తాలంకార సుశోభిత, జపమాలను చేతిలో ధరించిన ఒక దేవి ఆవిర్భవించినది. ఆమె పేరు సావిత్రి. ఆమె శ్రీకృష్ణుని ముందు నిలిచి, పరబ్రహ్మ స్వరూపుడు, సనాతనుడు అయిన శ్రీకృష్ణుని భక్తితో తల వంచుకొని, చేతులు జోడించి శ్రీకృష్ణుని ఇట్లు స్తుతించెను.

**సావిత్రిదేవి ఇట్లు పలికెను :**

సమస్తమునకు కారణభూతుడవు, బ్రహ్మ స్వరూపుడవు, సనాతనుడవు, పరాత్పరతరుడవు, నల్లనివాడవు, నిర్వికారుడవు, నిరంజనుడవు అగు నీకు నమస్కరించుచున్నాను.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sri+Brahma+Vaivarta+Mahapuranam**

* * *